

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-అనంతగిరి: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రముఖ పర్యాటక ప్రాంతంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు తరలి వచ్చారు. మండలంలోని ఉన్న బొర్రా గుహలు జనాలతో కిటకిటలాడింది. కటికి, తాడిగుడ, యూ పైంట్ లతో పాటు జలపాతాలు తిలకిస్తూ అనంతగిరి, చాపరాయి, కాఫీ ప్లాంటేషన్, సుంకరమెట్ట యు పాయింట్ ప్రాంతాలు జనాలతో కిటకిట లాడాయి. కుటుంబ సభ్యుల సమేతంతో ఘాట్‌రోడ్డు, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో సెల్ఫులు దిగుతూ సందడి చేస్తూ ఆనందంగా గడపారు.



తాడిగూడ వద్ద పర్యాటకుల సందడి

ఎరుపెక్కిన రంపచోడవరం

★ 'ఆదివాసీ అరణ్యఘోష'కు వేలాదిగా తరలొచ్చిన గిరిజనులు

★ చైతన్యం నింపిన సిపిఎం నాయకుల ప్రసంగాలు

★ గిరిజనుల బతుకులకు హాని కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

ప్రజాశక్తి - రంపచోడవరం: రంపచోడవరం ఆదివారం అరుణమయమైంది. రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని, ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన ఆదివాసీ అరణ్యఘోషకు వేలాది మంది గిరిజనులు తరలివచ్చారు. ఎర్రజెండాలు చేబూని స్థానిక ఐటిడిఎ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తమ సమస్యలపై పెద్దపెట్టున నినదించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ జరిగింది. దీనికి సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ ఎర్రజెండాతోనే ఏజెన్సీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. బిజెపి ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రమాదకర విధానాలను వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ప్రజల గొంతును చట్టసభల్లో వినిపించేందుకు రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలను దోచుకునే పార్టీలను ప్రజలే బహిష్కరించాలని పిలుపునిచ్చారు. వైసిపి, టిడిపి, జనసేన ఒకతానులో ముక్కలేనని అన్నారు. బిజెపికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రయోజనాలకు ఆయా పార్టీలు తిలోదకాలిచ్చాయని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీల అరణ్యఘోష సభను ప్రభుత్వం అడ్డుకునేందుకు చూసిందన్నారు. వేలాది మంది గిరిజనులు ఈ సభకు వస్తున్నారని తెలిసి అధికారులను బెదిరించి సభ నిర్వహించడానికి అనుమతులు ఇవ్వొద్దని అధికార పార్టీ నేతలు చెప్పారన్నారు. వైసిపి హయాంలో రంపచోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గతంలో చంద్రబాబూ ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు ఆయా ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను చెప్పుకుందామని వెళ్తే వారిని కలవకుండా పరదాల చాటు నుంచి దాక్కుని పారిపోయే జగన్‌లాంటి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకూ చూడలేదన్నారు. అమాయక దళిత, గిరిజనులను చంపి డోర్ డెలివరీ చేసిన వారు నేడు నాయకులుగా కొనసాగడం శోచనీయమన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంలో రంపచోడవరం ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని, ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీతో పాటు ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, విద్యార్థి సంఘం నాయకులు కె.ప్రసన్న కుమార్, సిపిఎం జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రాంబాబు, మట్ల వాణిశ్రీ, కె.సీతారామయ్య, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, పల్లపు వెంకట్, మేకల నాగేశ్వరరావు, పూనెం సత్యనారాయణ, సీసం సురేష్, పాయం సీతారామయ్య, ఐ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో నిర్వహిస్తున్న ఆదివాసీ అరణ్యఘోష ప్రదర్శన, ర్యాలీలో బివి.రాఘవులు తదితరులు



మాట్లాడుతున్న సీతారాం, వేదికపై బివి.రాఘవులు, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, కిరణ్

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోనీ బంగారు మెట్ట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో పాంగి లావణ్య (ఐదవ తరగతి) అనారోగ్యానికి గురై ఈనెల 13న మృతి చెందటంపై పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిని శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కోర్ర నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు అమాంతంగా పెరుగు తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, మండల ఏటిడబ్ల్యూ స్పందించలేదన్నారు. విద్యార్థిని మరణాలకు కారకులైన బంగారు మెట్ట పాఠశాల యాజమాన్యం పై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్స్‌లో హెల్త్ వాలంటరీలను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం స్పందించి ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించలేదన్నారు. సకాలంలో ఆసుపత్రికి తరలిస్తే మరణించేది కాదని తల్లితండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి జీనబంద్, ఎస్ ఎఫ్ ఐ నాయకులు కె దోంబ్రు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గిడ్డి ఈశ్వరి, కిషోర్‌కుమార్, నేతలు

విశాఖ రాజధానిగా వద్దే వద్దు

- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి -పాడేరు: ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖ నగరాన్ని రాజధానిగా వద్దే వద్దని డెమోక్రసీ ఇన్ డేంజర్ పేరిట అఖిలపక్షాలతో ఆదివారం పాడేరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. అల్లూరి జిల్లా పాడేరులో సేవ్ డెమోక్రసీ ఫోరమ్ నిర్వహించిన ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టిడిపి యువ నేత ఆడారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలుగుదేశం, జనసేన, సిపిఐ, సిపిఎం, విద్యార్థి సంఘాలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొనడం శుభపరిణామం అన్నారు. గత నాలుగున్నర ఏళ్లగా ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం భూస్థాపితం అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డెమోక్రసీ ఇన్ డేంజర్ పేరిట రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. గత 36 రోజులుగా అక్రమంగా కేసులు పెట్టి రాజమండ్రి జైల్లో పెట్టిన టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడి ఆరోగ్యం క్షీణించడం పట్ల దేశ విదేశాల్లోని తెలుగు వాళ్ళందరూ ఎంతో ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్క ఆంధ్రునిపై ఉందన్నారు. వైసిపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకుణ్ణి అక్రమంగా జైల్లో పెట్టినందుకు రాష్ట్ర ప్రజలు వైసిపికి రానున్న ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్తారన్నారు.

పాడేరు టీడీపీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఇప్పటివరకు కొంతైనా అభివృద్ధి జరగడానికి నాడు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలేనని ఆమె వెల్లడించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి, టీడీపీ నాయకులు మత్స్యరాస మణికుమారి, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ ఎంపిపి బొర్రా ఉమారాణి, హెచ్ఎం మన్యం జిల్లా అధ్యక్షులు జాన్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి- చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్నమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుండి 19తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తమ కళాశాలలో బిఎ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బిఎ ఆనర్స్ ఎకనామిక్స్, బీకాం ఆనర్స్ జనరల్ (మైనర్ కంప్యూటర్ అప్లికేషన్స్), బిఎస్‌సి ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి ఆనర్స్ జంతుశాస్త్రం, బిఎస్‌సి ఆనర్స్ రసాయన శాస్త్రం డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి, రెండవ, మూడవ దశలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు తమ విద్యార్థులకు వర్తిస్తాయన్నారు. డిగ్రీ కోర్సుల విద్యాబోధనతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు.

అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌పై దాడికి 101ఏళ్లు

ప్రజాశక్తి-అడ్డతీగల : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి 101సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అల్లూరి విగ్రహానికి అల్లూరి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరి పోరాటస్ఫూర్తి అందరికీ ఆదర్శనీయం కావాలని పిలుపునిచ్చారు. మన్యవాసుల సమస్యల పరిష్కారానికి అల్లూరిబాటలో పయనిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం కార్యదర్శి ఆర్ శ్రీనివాస్(స్టార్ శ్రీను), కార్యవర్గ సభ్యులు దెంగేటి సత్తిబాబు, చోడిశెట్టి సుబ్బారావు, ఎఎస్ఐ బుచ్చి దొర ,శ్రీనివాసరావు, యాట్ల పవన్ రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొని అల్లూరికి ఘన నివాళు లర్పించారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు

సేవా భారతి సేవలు అమోఘం



ఆత్మీయ సమ్మేళనంలో వైద్యులను సత్కరిస్తున్న సేవాభారతి ప్రతినిధులు

ప్రజాశక్తి -చింతూరు.: మన్యంలో సుదీర్ఘకాలంగా విద్య, వైద్యం సేవలందిస్తూ, ఎంతో మంది గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన సేవా భారతి సేవలను అమోఘమని పలువురు కొనియాడారు. సేవాభారతి సంస్థ ఆవిర్భవించి, 24ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం చింతూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సేవాభారతి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సాయికిషోర్ ఆరోగ్య భారతి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిఎస్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగయ్య మాట్లాడుతూ, సరైన పౌష్టికాహారం లేక అనారోగ్యంతో బాధపడుతున్న మారుమూల గ్రామాల ప్రజల అభ్యున్నతికి సేవాభారతి పాటుపడిందన్నారు. విద్య వికాస యోజన ద్వారా యువత జీవితంలో స్థిరపడేందుకు సహకారం అందించిన విద్యామిత్ర ట్రస్ట్ చైర్మన్ గారపాటి నారాయణ ట్రస్ట్ మెంబర్ లక్ష్మీ లకుధన్యవాదాలు తెలిపారు. సేవా భారతి ఆధ్వర్యంలో 2004లో ప్రారంభించిన బాల కార్మిక పాఠశాల ద్వారా విద్యనభ్యసించిన 600 మందిలో 90 మంది పలు వృత్తి వ్యాపారాల్లో స్థిరపడ్డారని, వీరికి హైదరాబాద్ విద్యామిత్ర ట్రస్ట్ సహకారం అందించిందన్నారు.. పోలవరం ముంపు మండలాలైన చింతూరు, వర రామచంద్రపురం, కూనవరం, వెలేరుపాడుతో పాటు కుక్కునూరు, భద్రాచలం, ఎటపాక మండలాల్లో 200 మారుమూల గ్రామాలలో పౌష్టికాహారం, వైద్య సౌకర్యాలు సేవాభారతి అందించిందన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో చింతూరులో నడుస్తున్న ఆసుపత్రి 40 గ్రామాలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈసందర్భంగా సేవా భారతి చింతూరు వైద్యులు డాక్టర్ గంగాధర ప్రసాద్, ఆవుల సుబ్బారావులను సన్మానించారు. కస్తూరిబా పాఠశాల. విద్యానగరం గిరిజన పాఠశాలకు క్రీడా సామాగ్రిని అందజేశారు.

బిర్సా ముండా జయంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి -రంపచోడవరం : వచ్చే నెల 14,15 తేదీల్లో జాతీయ స్థాయిలో పాడేరులో నిర్వహించే బిర్సా ముండా జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదివాసి జెఎసి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ కోరారు. మండలంలోని సీతపల్లి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలు, హక్కులు, సంస్కృతి పరిరక్షణకు జాతీయస్థాయిలో ఉద్యమం చేపట్టడానికి పాడేరులో నిర్వహించే బిర్సాముండా 148 జయంతి సభ వేదిక కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ఉద్యోగులు,యువత, విద్యార్థులు, మహిళలు,పెద్దలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్, రంపచోడవరం డివిజన్ చైర్మన్ పందుల కామరాజు, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, సోషల్ మీడియా కార్యదర్శి చవలం శుభ కృష్ణ, కత్తుల అదిరెడ్డి, మడకం వరప్రసాద్ దొర, ఇ..స్వప్న కుమారి, మట్ల కృష్ణారెడ్డి, మద్దేటి జగన్నాథరెడ్డి, కానెం విజయ లక్ష్మి, బలిజ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

వెండి మకరతోరణం బహూకరణ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ప్రసిద్ధి చెందిన మారమ్మ అమ్మవారికి ఖమ్మం శ్రీమిత్ర గ్రూప్ సంస్థ చైర్మన్ కె.ప్రవీణ్‌కుమార్, మాధవి దంపతులు ఆదివారం మారమ్మ అమ్మవారికి రూ.మూడు లక్షల విలువైన వెండి మకరతోరణాన్ని వితరణగా ఇచ్చి భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి వెండి మకరతోరణాన్ని అలంకరించారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాఫీ దిగుబడి, నాణ్యత పెంచడమే లక్ష్యం

-సాగు పద్ధతులుపై నిరంతర శిక్షణ
-రైతులకు ఎక్స్పోజర్ విజిట్స్
-సబ్సిడీపై 1000 సిమెంట్ కల్లాలు మంజూరు
-ప్రజాశక్తితో కాఫీ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్



ప్రజాశక్తి-పాడేరు: **పాడేరు ఏజెన్సీలో కాఫీ తోటల పెంపకం చేస్తున్న రైతులకు కాఫీ సాగు పద్ధతులు, మెళుకువలపై నిరంతర శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నట్లు అల్లూరి జిల్లా పాడేరు కాఫీ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్ వెల్లడించారు. ఏజెన్సీలో 2 లక్షల 40 వేల ఎకరాలలో కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులకు శిక్షణ ఇచ్చి కాఫీ దిగుబడి, నాణ్యత పెంచడమే ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ ఏడాది కాఫీ బోర్డు ద్వారా రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, సబ్సిడీ పథకాలు, తదితర వాటిపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే...**

కాఫీ రైతులకు సబ్సిడీ పథకాలు ఏమిటి?

గిరిజన రైతులు దిగుబడి చేసే కాఫీ నాణ్యతను పెంచడం కోసం సబ్సిడీపై ఒక రైతుకు ఒకటి చొప్పున సిమెంట్ కల్లాలను మంజూరు చేస్తున్నాం. 45 వేల యూనిట్ కాస్ట్‌తో 400 చదరపు అడుగుల సైజులో ఈ ఏడాది 1000 సిమెంట్ కల్లాలు మంజూరు చేశాం. వీటికి 50 శాతం సబ్సిడీ అందిస్తున్నాం. గత ఏడాది రెండు వేల కల్లాలు నిర్మించాం. వీటిపై కాఫీ పప్పును ఆరబెడితే నాణ్యత పెరుగుతుంది.

ఆర్గానిక్ ప్రొడక్ట్ గా కాఫీ

మార్కెటింగ్ సపోర్ట్ స్కీం కింద కాఫీ రైతు సంఘాలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీ చేయడం కోసం 75 శాతం సబ్సిడీ అందిస్తున్నాం. ఈ కాఫీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం రెండు వేల వరకు ఖర్చు అవుతుంది. ఆర్గానిక్ ప్రోడక్ట్‌గా కాఫీని మార్కెట్లో విక్రయిస్తే రైతులకు మంచి ధర లభిస్తుంది.

కాఫీ దిగుబడి పెంపుపై ఇస్తున్న శిక్షణ

రైతులకు కాఫీ దిగుబడి, ఆదాయం పెంపు కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కాఫీ తోటల సంరక్షణకు నెల వారి రైతులు నిర్వహించ వలసిన పనులపై తోటల వద్దే శిక్షణ ఇస్తున్నాం. రైతులకు ఎక్స్పోజర్ విజిట్స్ నిర్వహిస్తున్నాం. కాఫీ తోటల షెడ్ ప్లాంటేషన్ నిర్వహణ, బుష్ మేనేజ్మెంట్, కంపోస్టుల తయారీ, కంచె నిర్మాణం, సేంద్రియ పద్ధతులు, తదితర వాటిపై శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొన సాగిస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో కాఫీ సాగు చేస్తున్న రైతులకు ప్రాధాన్యత ఇచ్చి సాగు పద్ధతులపై శిక్షణ అందిస్తున్నాం.



ప్రపంచ స్థాయిలో అరకు కాఫీకి గుర్తింపు

ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ప్రపంచ కాఫీ సదస్సులో పాడేరు ఏజెన్సీలో కాఫీ పండించిన నలుగురు రైతులకు ఫైన్ కప్ అవార్డులు లభించాయి. ప్రపంచ దృష్టిలో అరకు కాఫీకి గుర్తింపు లభించింది. ఇది గిరిజన రైతులకు ఎంతో లాభం చేకూరుస్తుంది. భవిష్యత్తులో మరింత నాణ్యతతో కూడిన కాఫీని ఉత్పత్తి చేయడం దిగుబడి పెంచుకోవడం ఇప్పుడు రైతుల ముందున్న ప్రధాన కర్తవ్యంగా భావించి మరింత శ్రద్ధ పెట్టాలి.

పాత కాఫీ తోటల పునరుద్ధరణకు చర్యలు

పాత కాఫీ తోటలను సైతం పునరుద్ధరించు కోవడానికి తోడ్పాటు ఇస్తున్నాం. కాపురాని మొక్కల్ని తొలగించుకొని తోటల్ని సారవంతంగా తయారు చేసుకోవడానికి రైతులకు ప్రోత్సహిస్తున్నాం.

50 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: అక్రమంగా ఇన్నోవా కారులో గంజాయిని తరలిస్తుండగా స్థానిక ఎస్సై రవీంద్రకు ముందస్తు సమాచారం పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ బలగాలను అలెర్ట్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని దారపల్లి జంక్షన్ వద్ద పోలీసులు మోహరించి చాకచక్యంగా పట్టుకున్నారు. స్థానిక ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కించాయిపుట్ గ్రామం నుండి వస్తున్న ఇనోవ కారులో 50 కేజీల గంజాయి తరలిస్తున్నారు. పోలీసు బలగాన్ని చూసి, కారులో ఉన్న వారు తప్పించుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. ఒకరు పరారయ్యారు. ఇన్నోవా కారులో రెండు ప్లాస్టిక్ బస్తాలలో 50 కిలోల గంజాయి, రెండు ప్లాస్టిక్ సంచులు ఉన్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని 50 కిలోల గంజాయి, ఇన్నోవా కారు, ఒక మొబైల్‌ను ఎస్సై రవీంద్ర స్వాధీనం చేసుకున్నారు. 50 కేజీల గంజాయి విలువ సుమారు లక్ష ఉంటుందని అంచనా.కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. పరారైన నిందితుడిని త్వరలోనే సోదాలు నిర్వహించి పట్టుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి, పోలీసులు డి రమేష్, కే.సంజీవ్ పాల్గొన్నారు.



నిందితులతో పోలీసులు

టిడిపి ఆధ్వర్యాన 'న్యాయానికి సంకెళ్లు' నిరసన

ప్రజాశక్తి -కొయ్యూరు: చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసన భాగంగా టిడిపి అధిష్టానం పిలుపుమేరకు 'న్యాయానికి సంకెళ్లు' ప్యాలెస్‌లో పిచ్చోడు జగన్ కుట్రలు దేశానికి చేటు అంటూ కొయ్యూరు దుర్గమ్మ ఆలయం వద్ద ఎంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి శ్రేణులు మోకాళ్ళపై సంకెళ్లు వేసుకొని నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యంపై వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై కోర్టు సూచనలను పాటించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టిడిపి నేతలు అనిశెట్టి చిరంజీవి, సర్పంచ్ బాలరాజు, మేడిబోయిన చిన్న, ఉబల రాజేష్, నాగేశ్వరరావు, నాగార్జున, ములకల సత్తిబాబు, వజ్రప,దేవుడు, నాని బాబు, వాసా రాము, రేవలు, అప్పన్న, బుజ్జిబాబు, శ్రీను, శివ, మణికంఠ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న టిడిపి నేతలు

వైసిపి నేతకు నివాళి

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో సీకారి పంచాయతీ కేంద్రం సీకారి గ్రామ వైస్సార్సీపీ కార్యకర్త గొల్లోరి నారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ తనయుడు, మన్యం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శెట్టి వినయ్ సీకారి గ్రామంలో కుటుంబ సభ్యులకు పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. సీకారి సర్పంచ్ గుళ్లేలా కృష్ణారావు, పార్టీ అధ్యక్షులు వంతల ఆనందరావు, వైస్సార్సీపీ పార్టీ కన్వీనర్ కొర్ర కనకరాజు, గంపరాయి అజయ్ కుమార్ తదితరులు నివాళి అర్పించారు.

దల్లేరీ వాతే ప్రేమ గీతం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : తారా బలరాం క్రియేషన్స్‌లో పల్లవి లిడిపి సమర్పించిన దల్లేరీ వాతే (మనసులోని మాట) అనే సరికొత్త ప్రేమ గీతం బంజారా పాటను కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ.మురళీధర్‌రెడ్డి ఆదివారం పేజ్ -6లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతంలో ఎంతో అందంగా పాటను చిత్రీకరించడం అభినందనీయమన్నారు. ఈ పాటను శేషు సింగరాయకొండ దర్శకత్వంలో బలరాం సభావత్, స్నేహ హీరో హీరోయిన్లుగా నటించారు. పాటకు వెంకట్ అజ్మీరా సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఎస్.కుమారస్వామి, జి.ఆనంద్, ఎం.గోపాల్, బి.వెంకటేశ్వర్లు, బి.కృష్ణ, ఆర్.నర్సింహ, ఎన్.నర్సింగరావు, టి.ప్రభాకర్, విద్యుత్‌కుమార్‌వర్మ, శంకర్ నాయక్ హాజరయ్యారు.

ఝూన్సీకి రైతునేస్తం పురస్కారం

ప్రజాశక్తి -మధురవాడ : సేంద్రియ విధానంలో మిద్దె తోటను నిర్వహిస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలిచినందుకు బంగారు ఝాన్సీకి పద్మశ్రీ ఐవి సుబ్బారావు రైతునేస్తం 2023 పురస్కారం దక్కింది. ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం కృష్ణాజిల్లా, ఆత్కూరు గన్నవరం వద్ద ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రైతు నేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ద్వారా బంగారు ఝాన్సీ పురస్కారం అందుకున్నారు. బంగారు ఝాన్సీ మధురవాడలో సుమారు ఎనిమిదేళ్లుగా మిద్దె తోటను నిర్వహిస్తున్నారు. రైతు మాదిరిగానే శ్రమిస్తూ ఇంటి పంటకు అవసరమైన సేంద్రియ ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకొంటూ రసాయన రహిత ఆహారాన్ని వినియోగిస్తున్నారు. ఇంటిపంటలో విత్తన ప్రాముఖ్యతను గుర్తించి విత్తనాలను సేకరిస్తూ, నిల్వ చేస్తూ తాము వినియోగించుకోవడంతో పాటు తోటి ఇంటి పంటదారులకు కూడా అందిస్తున్నారు.

శ్రీ ప్రకాష్‌లో ఖోఖో పోటీలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: విద్యార్థులకు క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలలో సిబిఎస్ఇ 7 ఖో ఖో పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుండి సుమారు 1200 మంది క్రీడాకారులతో ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలు బాలుర, బాలికల విభాగంలో అండర్ 19 కేటగిరీలో మూడు రోజుల పాటు జరగనున్నాయని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. 17న గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం జరుగుతుందని అయన తెలిపారు. ప్రారంభ మ్యాచ్ బాలికల విభాగంలో ఫోర్ట్ సిటీ స్కూల్ (విజయనగరం) విజయం సాధించింది. పలు మ్యాచ్‌లలో వివిధ స్కూళ్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ అబ్జర్వర్ జి.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, నీళాదేవి, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి- నక్కపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2002-2003 లో పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన నక్కపల్లి పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, ఆడిన ఆటలు, గురువులు బోధించే తీరు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పాఠశాల మైదానంలో ఉదయం నుండి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. తమకు విద్యనేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు.

ఆదమరిస్తే అంతే సంగతి!

ప్రజాశక్తి-కోటవురట్ల: నిత్యం రద్దీగా ఉండే మండల పరిషత్ కార్యాలయ ఆవరణ ప్రధాన ద్వారం వద్ద నిర్మాణం చేపడుతున్న ప్రధాన గేటు మెటీరియల్ దారికి అడ్డంగా రహదారిపై వేయడంతో కార్యాలయాలకు వెళ్లే వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెటల్ పిక్కలు రోడ్డుపై ఉండటంతో వాహనదారులు కొన్ని సందర్భాల్లో జారీ పడిపోవడంతో గాయాలు పాలవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారికి అడ్డంగా ఉన్న మెటీరియల్ తొలగించాలని కోరుకుంటున్నారు.

కార్మికవర్గంపై దాడిని ఐక్యంగా ఎదుర్కోవాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికవర్గంపై కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి చేస్తున్న దాడిని ఐక్యంగా ఎదుర్కొనేందుకు కార్మికులు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల సిఐటియు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా కార్మిక వర్గంపై దాడి చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టే విధానం అమలు చేస్తోందని తెలిపారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చుతోందన్నారు. కార్మికులకు వేతనాలు తగ్గించడం, ఉపాధికి రక్షణ లేకుండా చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రం చేసే చట్టాలు, విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వ్యతికించకపోగా వాటి అమలుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూడా బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. హిందూత్వ కార్పొరేట్ విధానాలపై కార్మికవర్గాన్ని చైతన్యం చేసే విధంగా పనిలో మార్పు రావాలని పేర్కొన్నారు. నవంబర్‌లో జరిగే మహాపడావ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉత్తరాంధ్ర నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, కాకి సురేష్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, అమ్మన్నాయుడు, ఉమామహేశ్వరరావు, మన్మధరావు పాల్గొన్నారు.

దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -కొయ్యూరు : దేవీనవరాత్రుల సందర్భంగా కొయ్యూరు గ్రామంలో ఆలయ ధర్మకర్త ఎంవివి.ప్రసాద్ ఇంటి నుండి అమ్మవారు ఉత్సవ విగ్రహాన్ని గరగలు డప్పులు జాతరతో అమ్మవారి కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంవివి. ప్రసాద్, సర్పంచ్ మాకాడ బాలరాజు, అనిశెట్టి చిరంజీవి, మేడి బోయన చిన్న, మాకాడ లక్ష్మి, మాకాడ సరస్వతి, మొట్టడం వీరయ్య దొర, బాల అచ్చమ్మ, గాలి రాజు, శివ పాల్గొన్నారు. . ఉబల అప్పారావు, భానుమతి కుమారుడు ఉబల రాజేష్‌ఉమా దుర్గ దంపతులు పూజలు చేశారు. విగ్రహదాత మకడ రాజశేఖర్, ప్రియాంక దేవి పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో దేవీ నవరాత్రి ఉత్సవాలను సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ డిఎస్‌పి సురేష్, ఎస్ఐ రామకృష్ణ ప్రారంభించారు. దుర్గాదేవి మండపంలో వానపల్లి అప్పారావు దంపతులు ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు.. ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దుర్గాదేవిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి: అనకాపల్లి జిల్లా కు 16 న పర్యటన కు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు.అనకాపల్లి జిల్లా లో నెలకొన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల ప్రభావం కారణంగా ఖరీఫ్ సీజన్ లో వరి సాగు గణనీయంగా తగ్గిందని, జిల్లాలో కరువు తాండవిస్తుందని, కరువు దృష్ట్యా సీఎం ప్రకటన చేయాలన్నారు. మండలంలో ఆదివారం ఒడ్డిమెట్ట, చినరాంభద్రపురం గ్రామాల్లో రైతులతో కలిసి ఖాళీగా ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్ లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 5,125 ఎకరాలు గాను, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవలం 1,219 ఎకరాల్లో మాత్రమే రైతులు అష్ట కష్టాలు పడి వరి సాగు చేయగలిగారన్నారు. అనకాపల్లి జిల్లా లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు గాను, లక్ష ఆరువేల ఎకరాల్లో (78 శాతం) మాత్రమే పంట పంట నమోదైందన్నారు. సెప్టెంబర్ 30 వరకు పంట సాగు నమోదు చేసినా 78 శాతానికి మించి సాగుకాలేదన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సాధారణ విస్తీర్ణంలో సగం కూడా పంట నమోదుకాలేదన్నారు. వర్షాల్లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. కరువును పరిగణనలోకి తీసుకొని స్వల్ప కాలిక పంటలకు విత్తనాలు రైతుకు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బి.రాము, రైతులు బి.శివ గణేష్, పి.నూకన్ననాయుడు, పి.వెంకటగణేష్, పి.విగ్నేశ్వరుడు, పి.సత్తిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు, బైక్ ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ఘాట్ రోడ్ శివలింగపురం సమీపంలో బస్సు, బైక్ ఢీ కొన్న ఘటనలో గిరిజనుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విశాఖపట్నం నుండి అరకు వెళ్తున్న టూరిస్ట్ బస్సు, శివలింగపురం నుండి కాశీపట్నంకు బైక్ వెళుతున్నాయి. కొత్తూరు పంచాయతీ పరిధి పుట్టసింత గ్రామానికి చెందిన వంతల. మోహన్ బైక్‌పై వెళుతుండగా బస్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామని ఎస్ఐ రాము పేర్కొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం ఎంవివి సిటీ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... అడవివరం ప్రాంతానికి చెందిన ఉదయ్ కుమార్ (33), జగన్మోహన్‌తో కలిసి పోతిన మల్లయ్యపాలెంలోని ఎంవివి సిటీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళు తున్నారు. అదే మార్గంలో వస్తున్న కారు ఎంవివి సిటీ దగ్గర ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఉదయ్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. జగన్మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జగన్మోహన్‌ను పోలీసులు కెజిహెచ్‌కు తరలించారు. పిఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగర తీరం జోడుగుళ్లపాలెం సమీపంలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఆదివారం ఉదయం కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక వివరాలు సేకరించారు. మృతుని ముఖంపై గాయాలు కనిపించాయి. అలలు తాకిడికి రాళ్ళకు గుద్దుకోవడంతో ఆ గాయాలు అయి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన పల్లా మమతా (16) ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఎర్నమ్మ శనివారం రాత్రి పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక అనంతవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో 9 తరగతి చదువుతోంది. ఎఎస్ఐ నక్కా శ్రీనివాసరావు కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : నాతయ్యపాలెం జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ ఎదుట రెండు కార్లు ఢీకున్నాయి. గాజువాక నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వైపు రెండు కార్లు ప్రయాణిస్తున్నాయి. విశాఖ డెయిరీ సమీపంలో ముందు కారు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే మొబైల్ టీమ్ వారిని ఆసుపత్రికి తరలించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -పద్మనాభం : విద్యుదాఘాతంలో దువ్వు విష్ణు (23) తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధి గొల్లలపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఒక రైతు విద్యుత్ లేదని లైన్‌మ్యాన్ రామకృష్ణకు శనివారం ఫోన్‌చేశాడు. లైన్‌మ్యాన్ తనకు సహాయకునిగా ఉంటున్న దువ్వు విష్ణు(23)కు ఫోన్ చేసి విద్యుత్ సమస్య పరిష్కరించాలని సూచించాడు. సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పనిచేస్తుంగా వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలు పాలయ్యాడు. లైన్‌మ్యాన్, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని విష్ణును 108 సహకారంతో ఆస్పత్రికి తరలించారు.



మాట్లాడుతున్న పి.మధు

విశాఖ వేదికగా డిసెంబర్‌లో బాలోత్సవ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిన్నారులకు వివిధ రంగాలలో ఉన్న ఆసక్తులు గుర్తించి ప్రోత్సహించేందుకు విశాఖపట్నం వేదికగా బాలోత్సవ్ కార్యక్రమాన్ని డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో సెయింటాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు బాలోత్సవ్ కార్యదర్శి జివిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. చిన్నారుల సామర్థ్యాలను వెలికితీసే వేదికగా ఇది నిలువనుందన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవ్ కార్యక్రమ ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి.మధు మాట్లాడుతూ బాల బాలికలు సామాజిక మాధ్యమాల ఊబిలో చిక్కుకుని సెల్‌పోన్ ప్రపంచంలో బాల్యాన్ని కోల్పోతున్నారన్నారు. బాలలకు ఆహ్లాదంతో పాటు సామాజిక స్పృహను పెంచేందుకు బాలోత్సవ్ కార్యక్రమం తోడ్పడనుందని తెలిపారు. చిన్నారుల ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించాలన్నారు. చిత్రలేఖనం, జానపద కళారూపాలు, నృత్య రూపకాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలలు తమ సామర్థ్యాలను ప్రదర్శించాలని ఆరాట పడతారని, కానీ మోయలేని చదువుల భారాలతో సమయం కేటాయించలేక, సరైన వేదికలు లేక నిరాశకు గురౌతున్నారని పేర్కొన్నారు. భారత్ సర్జికల్స్ ఎమ్‌డి పి.రఘు అధ్యక్షతన జరిగిన ఆహ్వాన సంఘం సమావేశంలో రాష్ట్ర బాలోత్సవ్ సమన్వయకర్త మురళీకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎన్.దుర్గాప్రసాద్, వైఎల్ఎన్.రావు, వివిధ రంగాలకు సంబంధించిన సామాజిక వేత్తలు, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి- కలెక్టరేట్ : అమెరికా సామ్రాజ్యవాద అండతో పాలస్తీనాపై దురాక్రమణ యుద్ధానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్ చర్యలను నిరసిస్తూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్. భాను మాట్లాడుతూ అరబ్ దేశాలలో ఇజ్రాయిల్‌ను తన స్థావరంగా ఉంచుకొని, చమురు నిల్వలపై ఆధిపత్యం సాధించడం కోసం, అమెరికా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతోందన్నారు. ఇజ్రాయిల్ చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. విశ్వనాధ్, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. లలిత,జానకి,సతీష్, షణ్ముఖ్ పాల్గొన్నారు.

జిఒ 21, 31లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్: ఆటో కార్మికులకు గుదిబండలుగా మారిన జిఒ 21, 31లను రద్దు చేయాలని ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా గురురాఘవేంద్ర ఆటో స్టాండ్ డ్రైవర్లు జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్ మాట్లాడుతూ ప్రమాదాలు నివారణ పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 894 గజిట్ నోటిఫికేషన్‌కు అనుబంధంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం 21,31 జిఒలను తీసుకువచ్చి ఆటో,మోటార్ వాహనాలపై భారీగా జరిమానాలను విధిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

సిక్కు కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ ఆనంద్

ప్రజాశక్తి- కలెక్టరేట్: వైసిపి సిక్కు మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నగరానికి చెందిన డాక్టర్ దిల్లా సింగ్ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ విడుదల చేసిన ఉత్తర్వులను వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి ఆదివారం ఆయనకు అందజేశారు. తనకు పదవినిచ్చిన సిఎం జగన్, వైవి.సుబ్బారెడ్డిలకు డాక్టర్ ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు. సిక్కు సామాజిక తరగతి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

నేడు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ముఖ్యమంత్రి బిజీబిజీ - ఏర్పాట్లును పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్



ఏర్పాట్లు వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బిజీబిజీగా గడపనున్నారు. ఆయన పర్యటన ఖరారైన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం పరిశీలించారు. తొలుత ఐటి సెజ్‌లోని హిల్ నెంబర్-2 మీద ఏర్పాటు చేసిన ఇన్ఫోసిస్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను బీచ్ ఐటి డెస్టినీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఇన్ఫోసిస్ వంటి ఐటి దిగ్గజ సంస్థ ఇక్కడకు రావడం ఆనందంగా ఉందన్నారు. మరిన్ని ఐటి పరిశ్రమలు విశాఖకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఐటి ఉత్పత్తులలో విశాఖను సముచిత స్థానంలో నిలిపేందుకు జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బీచ్ క్లీనింగ్ కోసం ప్రత్యేకించి కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్నట్టు తెలిపారు. అమర్ వెంట మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ హరి వెంకట కుమారి తదితరులు ఉన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో నగరంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు.

తీరని వెతలు

- సాగునీటి వనరుల్లేక కరువు బారిన రైతులు
- పరిశ్రమల మధ్య నిర్వాసిత గ్రామాలు
- కాలుష్యంతో అనారోగ్య సమస్యలు
- అమలుకాని స్థానికులకు 75 శాతం ఉపాధి
- బ్రాండిక్స్‌లో ఇవ్వని రూ.10 వేలు వేతనం
- మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలు
- నేడు అనకాపల్లి జిల్లాకు సిఎం రాక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రంగా వున్నాయి. ఈ ఏడాది నిధుల సమస్యతో జలాశయాల నిర్వహణలేక శివారు ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సగం కూడా పంట వేయలేదు. వర్షాల్లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. 1,36,460 ఎకరాల్లో వరి సాగుకావాల్సివుండగా లక్షా ఆరు వేల ఎకరాల్లో (78 శాతం) నమోదైంది. పది మండలాల్లో వర్షపాతం లోటు వుంది. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తిచేస్తే తప్ప అనకాపల్లి జిల్లాకు సాగునీటి సమస్య తీరదు. సోమవారం జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు ఔషధ కంపెనీల ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటిస్తారన్న ఆశతో రైతులున్నారు. పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఫార్మా కంపెనీలకు ఆనుకొనివున్న తాడిని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో ఇళ్ల పట్టాల పత్రాలు పంపిణీ కార్యక్రమంలో సిఎం ఇచ్చిన హామీ ఒక్క అడుగూ ముందుకుపడలేదు. కంపెనీల మందుల కాలుష్యంతో జనం అనారోగ్యంపాలవుతున్నారు. ఎస్ఇజెడ్‌లో భూములు కోల్పోయిన గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించకపోవడంతో కాలుష్యంతో పరిశ్రమల మధ్య బతుకులు వెళ్లదీస్తున్నారు. ఏషియన్ పెయింట్స్ పరిశ్రమకు అత్యంత సమీపంలోని చినపూడిలో భూగర్భ జలాలు కలుషితంకావడంతో ప్రజలు తాగునీరు కొనుక్కుంటున్నారు. అచ్యుతాపురం మండలంలోని పరిశ్రమల మధ్యలోనున్న దుప్పుతూరు, చినతాళ్లదిబ్బ ప్రజలకు పునరావాసం కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్న హామీ అమలుచేయలేదు.

అచ్యుతాపురం ఎస్ఇజెడ్, పరవాడ ఫార్మా, ఇతర పరిశ్రమల్లో విద్యార్హత కలిగిన నిర్వాసితులకు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు లభించడంలేదు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్న ప్రభుత్వ జిఒను అమలు చేయకపోవడంతో ఉపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఎన్ఎఒబి నిర్వాసిత మత్స్యకారులు, చేతివృత్తిదారులు, రైతులకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వలేదు. శారద, వరహా నదుల్లో తెప్పలపై ఆధారపడి బతుకుతున్న వారికి రూ.2.50 లక్షల పరిహారం, ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు రేషన్ కార్డుకు రూ.1.30 లక్షలు చెల్లిస్తామన్న ప్యాకేజీ అమలుచేయలేదు. నిర్మాణ పనుల్లో నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడంతో ఉపాధికి వలసలు పోతున్నారు.

పరవాడ ఫార్మాసిటీలో ర్యాంకీ యాజమాన్యం రసాయన వ్యర్థాలను శుద్ధిచేయకుండా చెరువులు, సముద్రంలోకి విడిచిపెడుతోందని స్థానికులు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా కాలుష్య సమస్య తీరలేదు. 60 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలు పొందిన బ్రాండిక్స్ యాజమాన్యం 20 వేల మందికి మించి ఉపాధి కల్పించలేదు. ఉపాధి పొందిన వారికి సరైన వేతనాలు చెల్లించడంలేదు. కార్మికుని చేతికి నెలకు పదివేల రూపాయల వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు.

ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడంలేదు. అచ్యుతాపురం కేంద్రంగా వంద పడకల ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి హామీగానే వుంది. ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరిస్తామని ఎన్నికల ముందు, తరువాత మూసివేయడంతో చెరుకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా జిల్లా ప్రజానీకాన్ని పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఈసారైనా సిఎం వాటిపై స్పందిస్తారన్న ఆశతో పలువురు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

సమస్యలపై చర్చించే దమ్ముందా ?

- రాష్ట్ర మంత్రులకు గంటా శ్రీనివాసరావు సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రులకు దమ్ముందా ? అని మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాలు విసిరారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం విశాఖకు సిఎం జగన్ వస్తున్నారని, అంతకు ముందు ప్రారంభమైన వాటినే మళ్లీ ప్రారంభిస్తున్నారని తెలిపారు. రుషికొండలో సిఎం క్యాంప్ ఆఫీసుకు వెచ్చించిన ఖర్చులు మీద సోషల్ మీడియాలో పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయన్నారు. వీటిపై సమాధానం చెప్పాలన్నారు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నేటికీ పూర్తకాలేదన్నారు. విశాఖకు మెట్రో రైల్ ప్రాజెక్ట్ రాలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైల్వే జోన్ కోసం పెద్దగా మాట్లాడిన వైసిపి నాయకులు ఇప్పుడు మాట్లాడటం లేదన్నారు. ఉత్తరాంధ్ర వెనుకుబాటుపై నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం ఉద్యమం చేస్తున్న కార్మిక సంఘ ప్రతినిధులకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి 'బ్రాండ్ విశాఖ'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడం కోసం 'బ్రాండ్ విశాఖ'ను బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు ప్రతిపాదించారు. విశాఖను ఉన్నత స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశాలపై చర్చించేందుకు ట్రావెల్, టూరిజం, హోటల్ రంగాలకు చెందిన వివిధ ప్రముఖులతో, ప్రతినిధులతో హోటల్ దసపల్లాలో ఆదివారం జరిగిన విజన్ విశాఖపట్నం 2030 చర్చలలో ఆయన మాట్లాడారు.

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ఆదివారం మంత్రి అమర్‌ను ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు కెజి.రాఘవేందర్ రెడ్డి, జి.జనార్ధనరావు, అధ్యక్షులు బి.రవికాంత్ పాల్గొన్నారు.

జగన్ పాలన అక్రమాలమయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : జగన్ పాలన అక్రమాలమయమని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విజనరీ చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమ కేసుల్లో జైలుకెళ్లొచ్చిన సిఎం జగన్, అందరినీ జైలుకు పంపి కక్షసాధించుకుంటున్నారన్నారు. దేశవిదేశాల్లో 'బాబుతో మేము' అంటూ ప్రజలు అండగా నిలబడ్డారని, అదీ చంద్రబాబు సత్తా అన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై వైద్యులు ఇవ్వాల్సిన హెల్త్ బులిటెన్‌ను పోలీసులు, ఇతర అధికారులు ఇస్తున్నారన్నారు. జైల్లో ఫ్యాను, కనీస సౌకర్యాలు లేకుండా చేస్తూ, శిక్ష పడిన ఖైదీలతో సమానంగా చంద్రబాబును చూస్తూ కక్షసాధించడం బాధాకరమన్నారు. బాబు పెట్టిన భిక్షతో రాజకీయంగా ఎదిగిన అమర్‌లాంటివారు చంద్రబాబుగురించి వ్యంగ్యంగా మాట్లాడడం బాధాకరమన్నారు.చంద్రబాబుని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరికీ వుందన్నారు